సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 59 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13.50
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13.50 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.2°/ 21.4°
జిల్లాలో మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

గురువుల చేతుల్లోనే దేశ భవిత

విధి రాతను మార్చగల శక్తి ఉపాధ్యాయులకే ఉంది

- మా అమ్మ కూడా టీచరే..ఇప్పటికీ పనిచేస్తున్నారు
- ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు
- 'మంగళకర'లో కనుల పండువగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి తదితరులు

పుట్టపర్తి అర్బన్: తరగతి గది నుంచే దేశ భవిష్యత్‌కు పునాదులు వేయగల శక్తి ఒక్క ఉపాధ్యాయులకే ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సమాజంలో గురువుకు ఎంతో గౌరవం ఉంటుందని, అలాంటి వృత్తిలో ఉన్న వారంతా చాలా గొప్పవారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్ విద్యాసంస్థ ప్రాంగణంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ అరుణ్ బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ విచ్చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమం ప్రారంభంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి తదితరులు తొలి భారత ఉప ప్రధాని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.... తాను చదువుకునే రోజుల్లో పాఠశాల ప్రారంభం కాగానే శ్లోకాలు, గీతాలు ఆలపించేవారమని, కానీ వాటి గొప్పతనం అప్పట్లో తెలిసేది కాదన్నారు. వాటి విలువెంతో ఇప్పుడు తెలుస్తోందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను సాధించాలన్నారు. ప్రభుత్వం కూడా 'నాడు-నేడు' పనులతో పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు సైతం డిజిటలైజేషన్ సాధిస్తాయన్నారు. వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులంతా మారాల్సి ఉందన్నారు.

నా గురువులు కనిపిస్తే ఆశీర్వాదం తీసుకుంటా
విద్యార్థుల అభ్యున్నతి కృషి చేసే ఉపాధ్యాయులకు ఎప్పుడూ గౌరవం దక్కుతుందన్నారు. తాను విద్యను అభ్యసించిన ఒంగోలు, కందుకూరుకు వెళ్తే అప్పట్లో తనకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను కలిసి వస్తానన్నారు. వారి కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంటానన్నారు. అప్పట్లో బెత్తం దెబ్బలు తిని చదువుకున్న విద్య ఇప్పటికీ గుర్తుండిపోయిందన్నారు. అప్పట్లో అందరూ అర్థవంతంగా బోధించేవారన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి వాళ్లే కారణమన్నారు.

వద్దన్నా... మా అమ్మ పాఠాలు బోధిస్తోంది
తన తల్లి ఒక టీచర్ అని...ఇప్పటికీ హెచ్ఎంగా పని చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అప్పట్లో సెల్‌ఫోన్లు లేవని, నేడు అవి లేకపోతే ఏ పనీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. హెచ్ఎంగా వివిధ రిపోర్టులు అప్‌లోడ్ చేసేందుకు సెల్‌ఫోన్ తప్పనిసరి అయ్యిందని, దీంతో ఆమె ఇబ్బంది పడుతుందని భావించి ఉపాధ్యాయ వృత్తి మానేయమని తాము ఆమెకు చెప్పామన్నారు. దీంతో ఆమె దాన్ని సవాలుగా తీసుకుని టెక్నాలజీని అలవాటు చేసుకున్నారన్నారు. నా తల్లి, గురువుల వల్లే క్రమశిక్షణ, సమయపాలన అలవాటయ్యాయన్నారు.

వెనుకబడిన పిల్లలపై శ్రద్ధ అవసరం
తాను ఇటీవల పలు పాఠశాలలను సందర్శించగా, కొంతమంది పిల్లలకు తెలుగు రాయడం కూడా సరిగా రావడం లేదని, అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గత ఏడాది కరోనా వల్ల పది ఫలితాల్లో జిల్లా వెనుకబడిందని, ఈ సారి అలా జరగడానికి వీల్లేదన్నారు. ఈ ఏడాది 90 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు.

నేనూ టీచర్‌నే
తన ఉద్యోగ జీవితాన్ని టీచర్‌గానే ప్రారంభించానని ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో పవిత్రమైనదన్నారు. టీచర్లు చెబితే విద్యార్థులు ఎంతో ప్రేరణ పొందుతారన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు. దాన్ని గుర్తించి ఉపాధ్యాయులంతా విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించి పాఠాలు చెబితే ప్రతి ఒక్కరూ రాణిస్తారన్నారు. వినూత్న బోధనతో రాణిస్తున్న ఉపాధ్యాయులను ఇతరులూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

అంకిత భావంతో పనిచేద్దాం

విద్యార్థుల అభ్యున్నతికి అందరం అంకిత భావంతో పనిచేద్దామని డీఈఓ మీనాక్షి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మార్కులతో పాటు నైతిక విలువలు కూడా ముఖ్యమని, దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ బోధన చేయాలని సూచించారు. సంఘంలో గౌరవ మర్యాదలు అధికంగా గురువుకే దక్కుతాయని... వాటిని దిగజార్చకుండా చూడాలన్నారు. విద్యార్థులు సొంత పిల్లలుగా భావించి తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానానికి తీసుకెళ్లి రాష్ట్రంలో మన జిల్లాను ముందు వరుసలో నిలుపుదామన్నారు.

టీచర్లకు సన్మానం

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన 20 మందికి కలెక్టర్ అరుణ్ బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంగ్లిష్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మరో ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంగళకర ట్రస్ట్ కరస్పాండెంట్ సురేష్ అనును కలెక్టర్, డీఈఓ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జగరాజుపల్లి సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, మంగళకర ట్రస్ట్ ఏఓ జయచంద్రారెడ్డి, ట్రస్టీ ఆర్యా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన


వేడుకకు హాజరైన ఉపాధ్యాయులు, బంధుమిత్రులు

25 మందికి అవార్డులు



కేజీబీవీ ప్రిన్సిపాల్ రమాదేవిని సత్కరిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి


జ్యోతిర్మయి, హెచ్ఎం, ధనాపురం , పరిగి


నాగరాజు, బుక్కపట్నం


ప్రభాకర్, పెనుకొండ


హెబ్సిబా గ్రేస్, పరిగి


వెంకటేశులు, కొత్తచెరువు


షర్ఫుద్దీన్, ధర్మవరం


రమేష్‌బాబు నాయక్, చిలమత్తూరు


అనిత, నల్లమాడ


రమేష్, పెనుకొండ


కొండయ్య, లేపాక్షి


శ్రీరాములు, ధర్మవరం


ఎడిత్ రోస్, హిందూపురం


గిరిజాకుమారి, మడకశిర


సమీల, నల్లమాడ


సత్యనారాయణ, మడకశిర


ఇస్మాయిల్ ఖాన్, లేపాక్షి


కిష్టప్ప, సోమందేపల్లి


గోపి, కొత్తచెరువు


సలోమి గ్లోరియా, హిందూపురం


ఆలూరి లక్ష్మి, అమడగూరు


మోహన్‌కృష్ణ, అమరాపురం


నాగమణి, సిద్ధరాంపురం


రిజ్వానుల్లా, ఉక్కడం


బయపరెడ్డి, పులేరు

న్యూస్‌రీల్

8న జాబ్‌మేళా


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 8న ధర్మవరంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆయన తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

పుట్టపర్తి అర్బన్: విపత్తుల్లో ప్రజలకు వేగవంతమైన సేవలందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే 08555-292432 నంబరుకు ఫోన్ చేసి తెలపాలన్నారు. యంత్రాంగం వేగంగా స్పందించి తక్షణ సాయం చేస్తుందన్నారు.

29 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో జడితో కూడిన వర్షాలు పడుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలోని 29 మండలాల్లో వాన కురిసింది. అత్యధికంగా రామగిరి మండలంలో 34.2 మి.మీ వర్షపాతం నమోదైంది. తలుపుల 17.2 మి.మీ, రొళ్ల 16.2 మి.మీ, పుట్టపర్తి 15.6 మి.మీ, సీకేపల్లి 16.4 మి.మీ, కొత్తచెరువులో 14 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

తెరపై పాఠం..!

ప్రభుత్వ బడులంటే గతంలో చాక్‌పీస్‌లకూ అగచాట్లే అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు చాక్‌పీస్‌తో పనేలేదు. జగన్ సర్కార్ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా మార్చేసింది. సౌకర్యాల కల్పనలో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. బోధనలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఫలితంగా పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు... ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా టీచర్ల బోధన సాగుతోంది. తెరపై పాఠం చూస్తున్న విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

- సర్కారు బడి..సాంకేతిక ఒరవడి
- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా విద్యా బోధన
- జిల్లాలో 6 నుంచి 10వ తరగతి వరకూ అమలు
- పాఠం సులువుగా అర్థమవుతుందంటున్న విద్యార్థులు


ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు విశ్వం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

కదిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. జాతీయ విద్యా విధానం అమలుతో ఇతర రాష్ట్రాల పిల్లలతో ఏపీ విద్యార్థులు పోటీ పడేలా సన్నద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే బ్లాక్ బోర్డు లేదా గ్రీన్‌చాక్ బోర్డులకు బదులుగా 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్'(ఐఎఫ్‌పీ)ను తీసుకొచ్చింది. ప్రస్తుతం వీటి ద్వారానే ప్రభుత్వ బడుల్లో బోధన జరుగుతోంది. ఈ బోర్డును వివిధ రంగుల్లో కూడా మార్చుకోవచ్చు. వీటికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది.

తరగతి గదిలోనే విశ్వవీక్షణం
జిల్లాలో 6 నుంచి 10వ తరగతి వరకూ చదివే ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 203 ఉన్నాయి. వీటికి తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 1,234 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను సరఫరా చేసింది. ఇంటర్‌నెట్‌తో అనుసంధానమై ఉన్నందున వీటినే టీవీల మాదిరిగా కూడా ఉపయోగిస్తున్నారు. ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తున్న సమయంలోనే అందుకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు చూపిస్తారు. ఉదాహరణకు సోషియల్ టీచర్ విశ్వం పాఠం బోధించాలంటే గతంలో గ్రహాలకు సంబంధించిన ఫొటోలు బ్లాక్ బోర్డుపై గీయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఐఎఫ్‌పీ ద్వారా బొమ్మలతో పాటు గ్రహాలు ఎలా పరిభ్రమిస్తున్నయో కూడా వీడియో రూపంలో చూపిస్తున్నారు. తెలుగు టీచర్ ఒక కవి గురించి చెబుతుంటే బోర్డుపై ఆ కవి ఫొటో కూడా పిల్లలు చూస్తున్నారు. సైన్స్ టీచర్ గుండె పాఠం చెబుతున్నారంటే ఐఎఫ్‌పీ ద్వారా గుండె బొమ్మతో పాటు అది ఎలా పని చేస్తుందో కూడా పిల్లలు చూడగలుగు తున్నారు. దీని వల్ల ఉపాధ్యాయులకు బొమ్మ గీసే శ్రమ తగ్గింది. సమయం కూడా ఆదా అవుతోంది. దీంతో పాటు పిల్లలకు అర్థవంతంగా పాఠాలు బోధించగలుగుతున్నారు. విద్యార్థులు కూడా దృశ్య, శ్రవణ పద్ధతిలో సులభంగా పాఠాలు అర్థం చేసుకుంటున్నారు.

కార్పొరేట్ స్థాయి విద్యాబోధన



ప్రభుత్వ బడుల్లో ఇప్పుడు కార్పొరేట్ స్థాయి విద్యాబోధన అందుతోంది. ఇప్పటికే స్మార్ట్ టీవీలతో పాటు డిజిటల్ క్లాస్‌రూం(డీసీఆర్)ద్వారా బోధన అందిస్తున్నాం. ఇప్పుడు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా సరికొత్త విధానంతో బోధన సాగుతోంది. వీటి ద్వారా ఎంతటి కష్టతరమైన పాఠాలనైనా సులభంగా బోధించవచ్చు. వీటికి టీచర్ల నుంచే కాకుండా పిల్లల నుండి కూడా మంచి స్పందన వస్తోంది.
–మీనాక్షి, డీఈఓ

పాఠాలు అర్థమవుతున్నాయి



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా ఇప్పుడు ఏ సబ్జెక్టయినా బాగా అర్థమవుతోంది. ఎందుకంటే ఏ పాఠం బోధిస్తున్నారో దానికి సంబంధించిన బొమ్మలు దానిపై డిస్‌ప్లే చేస్తారు. అవి చూడగానే మాకు మైండ్‌లో నిలిచిపోతున్నాయి. ఒక సినిమా చూసినట్టు గుర్తుండి పోతున్నాయి.
–పవన్‌కుమార్, 10వ తరగతి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కదిరి

బోధన సులభతరం



ఐఎఫ్‌పీల ద్వారా బోధన సులభంగా ఉంది. దేని గురించి పాఠం బోధిస్తున్నామో అందుకు సంబంధించిన బొమ్మ బోర్డుపై గీయాలంటే సగం టైం సరిపోయేది. ఇప్పుడు అలా కాదు. క్షణాల్లో ఆ బొమ్మ బోర్డుపై చూపెడుతున్నాం. పిల్లలు కూడా బాగా దృష్టి సారిస్తున్నారు. విద్యారంగంలో ఈ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఇందులో సందేహంలేదు.
–ఎస్.లియాఖత్ అలీ,హెచ్ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కదిరి

బోగస్ ఓట్లన్నీ తీసేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి విజ్ఞప్తి


కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: ఏళ్ల తరబడి ధర్మవరం నియోజకవర్గంలో ఉండిపోయిన బోగస్ ఓట్ల విషయంలో విచారణ జరిపించి పూర్తిగా తీసివేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధారాలతో సహా బోగస్ ఓట్ల గురించి వెల్లడించారు. 2023 జనవరి 5న అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం ధర్మవరం నియోజకవర్గంలో తమ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్‌ఏలు ఇంటింటి సర్వే చేశారన్నారు. నియోజకవర్గంలో 24,567 ఓట్లు ఓటు మార్పు, డబుల్ ఎంట్రీలు, మృతుల కేటగిరీలో ఉన్నట్లు గుర్తించారన్నారు. వీటిపై బీఎల్‌ఓలతో విచారణ జరిపి నకిలీ ఓట్లను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జోగోనికుంట, సిద్దయ్యగుట్ట, సుందరయ్యనగర్, శివరాం నగర్ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రర్ అయ్యే ఇళ్లను సైతం డాటెడ్ లిస్ట్‌లో చేర్చారని, దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు క్రయవిక్రయాలు జరుపుకునే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రేమ ప్రదాయి..సత్యసాయి

- అలరించిన విశాఖ భక్తుల సంగీత కచేరి


భక్తులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

పుట్టపర్తి అర్బన్: ప్రేమ ప్రదాయి...సత్యసాయి అంటూ విశాఖ భక్తులు ఆర్తిగా సత్యసాయిబాబాను కీర్తించారు. పర్తియాత్రగా మూడు రోజుల పర్యటన నిమిత్తం విశాఖపట్నం నుంచి వచ్చిన 1,800 మంది భక్తులు మంగళవారం సాయంత్రం సత్యసాయిని కీర్తిస్తూ గీతాలను ఆలపించారు. శాంతి ప్రదాయిని, ప్రేమ ప్రదాయిని సత్యసాయి..., సాయిశంకర, భక్తకింకర అంటూ గంటన్నర పాటు వారు చేసిన సంగీత కచేరీతో భక్తులు ఆధ్యాత్మిక పరవశం చెందారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు వారికి నూతన వస్త్రాలను, సత్యసాయి చిత్రపటాలను బహూకరించారు.


సంగీత కచేరీ చేస్తున్న విశాఖ భక్తులు

క్లుప్తంగా

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

అనంతపురం సిటీ: మొబైల్ రంగంలో 4జీ సాంకేతికతను అందిపుచ్చుకుని మరో రెండు నెలల్లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా మంగళవారం తెలిపారు. ఇప్పటికే కొందరు వినియోగదారులు 3జీ సేవలు పొందుతున్నట్లు వివరించారు. 4జీ సాంకేతికతను ప్రారంభించిన తర్వాత 3జీ సిమ్‌ను 4జీకి మార్చుకోవాలని సూచించారు. 4జీ సిమ్ వేసుకున్నా 2జీ లేదా 3జీ సర్వీసులూ కొనసాగించవచ్చన్నారు. 3జీ సిమ్ కలిగిన వినియోగదారులకు ఈ నెలాఖరు వరకూ ఉచితంగా 4జీ అప్‌గ్రేడేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాలు, ఫ్రాంచైజీ, రిటైలర్ల వద్ద 4జీ సిమ్ అప్‌గ్రేడేషన్ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సిమ్ 2జీనా లేక 3జీనా అనే విషయం తెలుసుకునేందుకు మొబైల్ నుంచి సిమ్ అని ఆంగ్లంలో టైప్ చేసి 94412 99999 నంబర్‌కు మెసేజ్ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నిబంధనల మేరకు ఒకవేళ తమ సిమ్‌ను పేపర్ అప్లికేషన్ ద్వారా పొంది ఉన్నట్లైతే అటువంటి వినియోగదారులు కేవైసీ ద్వారా డిజిటలైజ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు

హిందూపురం టౌన్: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. ఈ నెల 3, 4 తేదీల్లో అనంతపురంలోని అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు జరిగాయి. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టోర్నీ విజేతగా అనంతపురం జట్టు నిలవగా.. రన్నర్‌ప్‌ను వైఎస్సార్ జిల్లా జట్టు దక్కించుకుంది. అయితే మూడో స్థానం కోసం నిర్వహించిన పోటీల్లో తిరుపతి జిల్లా జట్టుతో తలపడిన శ్రీసత్యసాయి జిల్లా క్రీడాకారులు 4–2 గోల్స్ తేడాతో గెలుపొందారు. ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి సలీమ్, కోచ్ విజయవాణి, టీమ్ మేనేజర్లు సాయిలత, ఆయేషా అభినందించారు.

‘మామూళ్ల’ మత్తులో సెబ్

- విచ్చలవిడిగా కర్ణాటక మద్యం
- ఎడాపెడా నాటుసారా తయారీ
- డోర్ డెలివరీతో అదనపు ఆదాయం
- వాట్సాప్ కాల్స్ ద్వారా ఇంటి వద్దకే సరఫరా
- సరిహద్దు ప్రాంతాల్లో లోపించిన పర్యవేక్షణ
- కార్యాలయానికే పరిమితమైన ఎన్‌ఫోర్సుమెంట్



సాక్షి, పుట్టపర్తి: సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టంగా వ్యవహరించాల్సిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) ఉద్యోగులు నెలవారీ మామూళ్ల మత్తులో కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఫలితంగా కర్ణాటక మద్యం, నాటుసారా తయారీ, రేషన్ బియ్యం అక్రమ తరలింపులు యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లా సరిహద్దులో నిఘా లోపించడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వాట్సాప్ ఫోన్ కాల్స్ ద్వారా కోరుకున్న ప్రాంతానికే మద్యం సరఫరా చేస్తున్నారు. అంతేకాక కొన్ని ప్రాంతాల్లో నిషేధిత నాటు సారా తయారీ, సరఫరా జరుగుతోంది.

టార్గెట్లు విధించి అక్రమ వసూళ్లు

మద్యం, నాటుసారా అక్రమ వ్యాపారానికి సెబ్ అధికారులే ఊతమిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. నెలవారీ కేసుల నమోదు లక్ష్యం నేపథ్యంలో అప్పుడప్పుడే కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే వాస్తవానికి నెలవారీ మామూళ్ల వసూళ్లకు ప్రత్యేకంగా టార్గెట్‌లు విధించి అక్రమ దోపిడీకి తెరలేపినట్లుగా తెలుస్తోంది. తమకు ‘మామూళ్లు’ ఇవ్వని వారిని నిర్బంధించి డబ్బు వసూలు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా స్టేషన్‌కు తిరిగి వస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. సెబ్ జిల్లా అధికారి నుంచి కానిస్టేబుల్ వరకూ ప్రతి ఒక్కరు ఏరియాలను పంచుకుని వసూళ్లకు తెరలేపినట్లు విశ్వసనీయ సమాచారం.

అంతా ఆ అధికారి కనుసన్నల్లోనే

మద్యం అక్రమ రవాణా, విక్రయాలతో పాటు నాటు సారా తయారీ అమ్మకాలు, రేషన్ బియ్యం అక్రమ తరలింపులను సమర్థవంతంగా అడ్డుకోవాల్సిన ఓ అధికారినే అక్రమాలకు తెరలేపినట్లుగా ఆ శాఖలోని ఉద్యోగులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అంతా ఆయన కనుసన్నల్లోనే జరుగుతుందని అంటున్నారు. తన కింది స్థాయి ఉద్యోగులను నియంత్రించకుండా నెలా మామూళ్ల మోజులో కార్యాలయానికే పరిమితమైన ఆ అధికారి, ఏకంగా తన చాంబర్‌నే పడకగదిగా మార్చుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. అంతేకాక స్టేషన్ల వారీగా నెలవారీ టార్గెట్‌లు విధించి అక్రమ వసూళ్లకు తెరలేపడంపై సెబ్ ఉద్యోగులే మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా తమ అధికారికి ఇవ్వాలనే సాకుతో కింది స్థాయి సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నట్లుగా తెలుస్తోంది.

కుంటి సాకులు చెబుతూ..

జిల్లా వ్యాప్తంగా 32 మండలాలకు తొమ్మిది సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. సిబ్బందికి అనుగుణంగా బాధ్యతలు కేటాయించారు. అయితే ఈ బాధ్యతలు ప్రభుత్వ నిబంధనలను అమలు చేసేలా కాకుండా.. మామూళ్లు వసూలు చేసుకువచ్చేలా ఉండడం గమనార్హం. ఇదే అదనుగా భావించిన కొందరు ఉద్యోగులు తనిఖీలు చేయడం మానేసి కుంటి సాకులతో కాలం నెట్టుకొస్తున్నారు. సెబ్ సిబ్బంది పర్యవేక్షణ లోపించడంతో సరిహద్దు ప్రాంతాల్లో యథేచ్ఛగా రేషన్ బియ్యం, కర్ణాటక మద్యం అక్రమ రవాణా దందా కొనసాగుతోంది.

వాట్సాప్ కాల్‌లోనే తతంగం

కర్ణాటక మద్యం, నాటుసారా అక్రమ సరఫరా తతంగం మొత్తం వాట్సాప్ కాల్ ద్వారానే జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాట్సాప్ కాల్ చేస్తే.. వినియోగదారుడు కోరుకున్న చోటుకు సరుకు తీసుకెళ్లి ముట్టజెబుతున్నారు. ఈ సమాచారం సెబ్ అధికారులకు తెలిసినా... తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల కళ్లుగప్పేందుకు ఒకట్రెండు కేసుల టెట్రా ప్యాకెట్లు మాత్రమే పట్టుకెళ్లి ఫొటోలకు ఫోజులిస్తున్నట్లుగా పలువురు విమర్శిస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

“కర్ణాటక మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నాం. సమాచారం అందిన వెంటనే సెబ్ సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నారు. ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదు. సెబ్ సిబ్బందిపై ఆరోపణలు అవాస్తవం. సిబ్బంది తక్కువగా ఉండడంతో అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో నిఘా పెట్టడం కష్టంగా ఉంది.
– రవికుమార్, సెబ్ సూపరింటెండెంట్

ఎంపీ మాధవ్‌తో ఎలాంటి విభేదాలు లేవు

- ఆరోపణలపై రామదాసప్పనాయుడును లోతుగా విచారించాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిష్టప్ప



మాట్లాడుతున్న కిష్టప్ప

రాప్తాడు రూరల్: తనకు, ఎంపీ గోరంట్ల మాధవ్‌కు మధ్యలో విభేదాలున్నాయని సీనియర్ జర్నలిస్ట్‌గా చెప్పుకుంటున్న రామదాసప్ప నాయుడు చేసిన ఆరోపణలు వాస్తవం కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ అధ్యయన కమిటీ సభ్యుడు కిష్టప్ప స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురం శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక హాని చేసేందుకు ఎంపీ మాధవ్ కుట్ర పన్నినట్లుగా ఇటీవల అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావుకు తన ప్రమేయం లేకుండా రామదాసప్ప నాయుడు ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ అంశానికి సంబంధించి తనకు కనీస సమాచారం కూడా లేదన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనవసరంగా ఎంపీపై నిరాధార ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

రూ. లక్ష డిమాండ్ చేసిన నాయుడు

ఇటీవల రామదాసప్పనాయుడు హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను రూ. లక్ష డిమాండ్ చేశారు. 74168 04719 నంబర్‌కు గూగుల్ పే ద్వారా డబ్బు పంపాలని ఎంపీ మొబైల్ నంబర్‌కు మెసేజ్‌లు పెట్టాడు. రెండు రోజుల్లోపు తాను అడిగిన డబ్బు ఇవ్వాలని అందులో పేర్కొన్నాడు.

నేమకల్లు ఆలయానికి పోటెత్తిన భక్తులు





స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు (ఇన్ సెట్‌లో) నిమ్మకాయల అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయానికి మూడో మంగళవారం భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకుడు అనిల్ కుమారస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. నిమ్మకాయలు, పూలు, తులసీ మాలలతో మూల విరాట్‌ను అలంకరించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సుందరకాండ పారాయణం, హోమాలు నిర్వహించారు.

కుష్టు లక్షణాలను గుర్తించండి

- జిల్లా కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య



మాట్లాడుతున్న డాక్టర్ తిప్పయ్య

పరిగి: కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించాలని ఆశ కార్యకర్తలకు జిల్లా కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య సూచించారు. మంగళవారం పరిగి పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. గృహాల సందర్శనలో ఎవరైనా జ్వరం, ఎడతెరపి లేని దగ్గు, బరువు తగ్గుట, ఆకలి మందగించడం వంటి లక్షణాలున్న వారిని గుర్తించాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు కనిపిస్తే ప్రభుత్వాసుపత్రికి పిలిపించి, నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.500 అందజేస్తుందన్నారు. దీనికి తోడు మందులు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ రమణ, మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, సుకేష్‌కుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన పారదర్శకంగా జరగాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి అర్బన్: ఓటరు పరిశీలన ఎన్నికల కమిషన్ నిబంధల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్లు, మండల స్పెషలాఫీసర్లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం ఆయన కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ఓటర పరిశీలన అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సరైన కారణం లేకుండా ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగించవద్దన్నారు. అలాగే డూప్లికేట్ ఓట్లు నమోదు కాకుండా చూడాలన్నారు. కదిరి నియోజకవర్గంలో మొత్తం 9,643 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. చనిపోయిన, మరొక ప్రాంతానికి వలసపోయిన తదితర కారణాలతో తొలగించిన ఓట్లపై మరోసారి పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రాఘవేంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ఓటర్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ఇందులో ఎలాంటి తప్పిదాలకు తావివ్వరాదని ఎన్నికల సిబ్బందిని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ధర్మవరం మండలం నిమ్మలకుంటలో మంగళవారం చేపట్టిన ఓటర్ల పరిశీలన ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. మరణించిన వారి ఓట్ల వివరాలు, డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓటర్లపై జాబితా ఆధారంగా క్షేత్ర స్థాయిలో ర్యాండమ్‌గా పరిశీలించారు. మరణించిన వారి ఇళ్ల వద్దకెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, చనిపోయింది నిజమేనా? సంతకాలు మీరే చేశారా? అని ఆరా తీశారు. ఓటర్ల సర్వేలో భాగంగా ఇళ్ల వద్దకు అధికారులు వచ్చారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యోగీశ్వరీదేవి, ఎన్నికల డీటీ అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల భాగస్వామ్యం పెరగాలి

- వారం లోపు పనులు పూర్తి చేయాలి
- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు
- డ్వామా పీడీ రామాంజినేయులు



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ రామాంజినేయులు

మడకశిర: జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు డ్వామా పీడీ రామాంజినేయులు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై ఆయన సమీక్షించారు. మండలాల వారీగా ఉపాధి పనుల వివరాలు ఆరా తీశారు. ఎంత మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారో అడిగి తెలుసుకున్నారు. మడకశిర నియోజకవర్గంలో కూలీల సంఖ్య మరింత పెరగాలన్నారు. అడిగిన వెంటనే పనులు కల్పించాలన్నారు. ప్రధానంగా ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. వారం లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీ జయసింహ, కోర్సు డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏపీఓలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

భూగర్భజలాలు పెంపుకు ప్రత్యేక చర్యలు

మడకశిర రూరల్: ప్రతి వర్షపు నీటి బొట్టును వడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ రామాంజినేయులు తెలిపారు. మంగళవారం ఆయన మడకశిర మండలం కదిరేపల్లి, బుళ్లసముద్రం పాఠశాలలో చేపట్టిన ఇంకుడు గుంతల పనులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 12 పాఠశాలల్లో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీకాంత్‌గౌడు, ఏపీడీ జయసింహ, కోర్సు డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి

గుడిబండ: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా పీడీ రామాంజినేయులు సూచించారు. మంగళవారం గుడిబండ మండలం జంబులబండ, మోరుబాగల్, కె.ఎన్.పల్లి పంచాయతీల్లో చేపట్టిన డ్రైల్యాండ్ హార్టీకల్చర్ పంటలను పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి రికార్డులు పరిశీలించి, మాట్లాడారు. మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగుపై రైతులను చైతన్య పరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జయసింహ, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, టీఏ వెంకటేష్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

అమరాపురం: మండలంలో జాతీయ ఉపాధి హామి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను డ్వామా పీడీ.రామంజనేయులు మంగళవారం పరిశీలించారు. ఏఏ పనులు ఎంత చేశారు, నిధుల ఖర్చు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. డ్రైల్యాండ్ హార్టీకల్చర్‌పై ఆరా తీశారు. అనంతరం కె.శివరం గ్రామ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఇంకుడు గుంత పనులు, చిట్నడలో సాగు చేసిన దానిమ్మ తోటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జయసింహ, ఎంపీడీఓ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన



వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: నవజాత శిశువుల్లో ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా ‘నవజాత శిశువుల్లో ఆరోగ్య సమస్యలు–నివారణ పద్ధతులు’ అంశంపై పుట్టపర్తిలోని స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం పీహెచ్‌సీల వైద్యాధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పిల్లల్లో ప్రధానంగా ఎదుగుదల సమస్యలు వస్తాయని, వాటిని ముందుగా గుర్తించి పరిష్కరించాలన్నారు. పుట్టుక లోపాల్లో భాగంగా పెదవి చీలిక, గ్రహణ మొర్రి, ఎదుగుదలలో వచ్చే లోపాలు, రక్తహీనత, విటమిన్ల లోపం, పోషకాహార లోపం, చర్మ వ్యాధులు, చెవి, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, వైకల్యంపై వచ్చే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

రొద్దం: రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన రొద్దం మండలం ఆర్.మరువపల్లి చెక్‌పోస్టుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఆచూకీ లభ్యమైంది. రెండు రోజులు క్రితం పాఠశాలకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు... మంగళవారం పెనుకొండ సమీపంలో విద్యార్థినిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. విచారణ అనంతరం ప్రస్తుతం కుటుంబసభ్యులకు అప్పగించారు. గురువారం బాలికను సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పరిచి కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పేర్కొన్నారు.

డీఎస్పీ బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత



డీఎస్పీ బంగ్లా ఆవరణలో నరికేసిన శ్రీగంధం చెట్టు

పుట్టపర్తి టౌన్: స్థానిక డీఎస్పీ బంగ్లా ఆవరణలోని శ్రీగంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లారు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కోత మిషన్ ద్వారా చెట్టును నరికినట్లుగా తెలుస్తోంది. కొన్ని రోజులుగా బంగ్లా ఆవరణలోని పాత కార్యాలయం స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టారు. మంగళవారం ఉదయం కొమ్మలు పడి ఉండడం స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనతో పోలీసులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు పోలీస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గస్తీ నిర్వహణలో అలసత్వం కారణంగానే దుండగులు చెలరేగిపోతున్నారని చీవాట్లు పెట్టారు. దీంతో శ్రీగంధం చెట్ల నరికివేత, అక్రమ తరలింపుపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు.

ఆకట్టుకున్న విశాఖ భక్తుల పర్తియాత్ర



సాయి రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి అర్బన్: పర్తియాత్రలో భాగంగా విశాఖ భక్తులు మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. రథోత్సవాన్ని సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఆలిండియా అధ్యక్షుడు లక్ష్మణరావు ప్రారంభించారు. స్థానిక సత్యమ్మ ఆలయం నుంచి గోపురం వీధి మీదుగా ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వరకూ రథయాత్ర సాగింది. దారి పొడవునా సాయినామ సంకీర్తనలతో భక్తులు హోరెత్తించారు. మహిళలు తలపై సాయి పాదుకలను మోస్తూ కదిలారు. భజనలు, కోలాటం, వివిధ రకాల నృత్యాలు చేస్తూ సందడి చేశారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్